# నవ్విన బ్రతుకులు

రచన: శ్రీ బోడా కోటేశ్వరరావు

ఇన్నాళ్ళకు తీరికగా పొద్దుపోయింది గూడా గమనించకుండా మెరినా బీచిలో యిసుకలో కూర్చుని వెనుకటి జ్ఞాపకాల్లో కూరుకు పోయింది సరోజిని. దూరంగా ఆగి ఆగి కాంతుల్ని వెదజల్లుతోంది లైట్ హౌసు అనేక దీపాలు నిశ్చలంగా వెలుగుతున్నా ఉండి ఉండి కనిపించే ఆ వెలుతురే రేవుకు బయలుదేరిన ఓడలికి మార్గదర్శి అవుతుంది. ఉండి ఉండి తొంగిచూచే తరుణ వాంఛలతో నిండిన తనూ ఒక లైట్ హౌసే. కాకపోతే చాలమంది తనని నాశనం చేయాలని బయలుదేరి ఆ అంధ ప్రవృత్తిలో దారి తప్పి యిసుక దిబ్బల్లో కూరుకుపోయారు. ఒక్క రాజు మాత్రం తన్ని సరిగా అనవాలు పట్టి తన జీవితంలో లంగరేసుకుని ఉండిపోయాడు. వెనుకటి జ్ఞాపకాలు తరుముతూ వుంటే ఆమె ఉక్కిరి బిక్కిరై పోయింది.

* * *

సరోజినిది అసలు మద్రాసుగాదు మారు మూల పల్లెటూర్లో ఆగర్భ శ్రీమంతుల యింటిపిల్ల. అంతకంటె కలవారి యింట్లో కాలు పెట్టింది. కాని సాంసారిక జీవితమంటే ఏమిటో అనుభవానికి రాక ముందే ఆమె నుదుటి కుంకుమ రాలిపోయింది గర్భ శత్రువులాంటి జీవితాన్ని ముందు పెట్టుకొని పుట్టింటికి చేరింది. విచిత్రమైన ఆమె జీవితంలో పరిస్థితులు గూడా విచిత్రంగానే ఏర్పడ్డాయి. ఇక్కడా ఆమెకి ఒంటరితనమే సంప్రాప్తించింది. ఎంత వుందో తనకే తెలీని ఐశ్వర్యంతో ఆమె ఏకాకిని అయిపోయింది. ఇక్కడి నుండి సరోజిని జీవితం ఒక్కసారిగా మారిపోయింది.

ఇప్పుడు సరోజినిని చూసినవాళ్ళు ఒకప్పుడు ఆమె ఒక అమాయకురాలంటే ఎంతమాత్రం నమ్మలేరు. అమాయక, డబ్బున్న ఆడది, ఒంటరిది, అనుభవం లేనిది. లోకంపోకడ తెలియనిది. అందగత్తె విగత భర్తృక నిండా పదిహేడుయేళ్ళన్నా లేని తరుణి తలా ఒక విధంగా వూహించుకుని పేవాలు తడుపుకున్నారు. వూళ్లో చాలమంది తోడి ఆడవాళ్ళకిగూడా కింట్లో నలుసే అయింది సరోజని.

బటాచోరులాగా తిరిగే రంగారావు, రంగేళీ రాజాగా మెరిసే మోహనరావు, చీట్లపేకతో ఆకలిదప్పులు తీర్చుకొనే పెద్ద నాయుడు, తలలు మార్చే కరణం కాంతయ్య అందరూ సరోజినిని చూసి అదృష్టం నాదంటే నాదని జబ్బలు చరుచుకున్నారు. మంచిమాటలు చెబుతూ, అనునయిస్తూ, "నీకేం ఫర్వాలేదూ, నీ యావత్తు భారాన్ని నా భుజాలమీద పెట్టు" అంటూ తలొక విధంగా ఆ యింటికి రాకపోక తేర్పరచుకున్నారు. కాని వాళ్ళ వెకిలి మెహాలూ, నొసలు ఎగరవెయ్యడాలూ, తన వరసకివచ్చి కూర్చోవాలని ప్రయత్నించడాలూ, ఆమెకి క్రొత్తగా అనిపించాయి. వీళ్ళలో అందరూ కాకపోయినా చాలమంది తన తండ్రి దగ్గరకి వచ్చిపోతుండేవాళ్ళే. "కాని ఆ భయం - ఆ వినయం వీళ్ళలో యిప్పుడు కనిపించవేం" అనుకునేది సరోజిని. కాళ్ళ కింద కాకి అడుగులేర్పడుతున్న కాంతయ్య ఆలోచిస్తూ కన్ను గిలుపుతాడు. గడ్డమంతా కలగాపులగంగా నరిసిపోయిన పెద్ద నాయుడు కళ్ళల్లో తన్ను చూసేసరికి ఏవో కోర్కెలు మండిపోయేది. వయసులో వున్న రంగారావు మోహనరావులు సరే సరి తనని రాసుకుంటూ తిరగాలనే వాళ్ళ తాపత్రయం అంతా. తనకి ఏకాకితనం అంటే వదలిపోయింది. తనింట్లో వీళ్ళంతా ఒకటే కాకిగోల. కొంతకాలమయ్యేసరికి ప్రతివాడూ మరొకడ్ని గురించి అసలు నిజం చెప్పి వెయ్యటం ఆరంభించారు. అప్పటినుండీ తనకి భయం వెయ్యడం మొదలెట్టింది అయినా ఎవ్వరినీ తనింటికి రావద్దని చెప్పలేకపోయేది.

ప్రచురణకు స్వీకరించిన

పోటీ కథానిక

ఒకనాడు ఎవ్వరూలేని సమయంచూసి కాంతయ్య సరోజని యింటికి వచ్చాడు. వస్తూనే చూడు సరోజినీ! తూర్పు పొలంలో పంటలు ఇవ్వాళ నూరుస్తున్నారు, ఉత్తరపు పొలంలో యీ యేడు ఖర్చులన్నీ పోను దాదాపు నాలుగువేలు దాకా మిగలవచ్చు. తూర్పు పొలంలో వడ్లు బేరానికి వచ్చినయ్! నీ అవసరానికి కావలసినవి అట్టే పెట్టి మిగతావి మూడు వేలకి బేరం ఫైసలు చేశాను" అన్నాడు.

"ఏదో పెద్దవారు! తెలిసినవారు అని అంతా మీకు వదలిపెట్టాను. ఎలాగో గట్టెక్కించండి" అంది సరోజని.

"అదే సరోజనీ! ఇంతభారం ఎందుకు మోస్తున్నానంటావ్. నీమొహంచూచి కాకపోతే. నేను భారంవహిస్తే గట్టున వడకుండా మరోలా జరుగుతుందాసరే యీ మాటకేమొచ్చె జరూరు పనివుంది, మళ్ళా సాయంత్రం కలుసుకుంటాను" అంటూ బైటకి వచ్చాడు సరోజనిగూడా అతనితో పాటు బైటికి వచ్చింది పంపడానికి.

దూరంగా స్కూలునుంచివస్తూ రాజు కనిపించాడు, రాజు యింకా చదువుతున్నాడా అని ఆశ్చర్యపడింది సరోజిని. తాననుకోవడం యీ రాజు యీపాటికెక్కడో పాలేరుగా జేరి పొట్టబోసుకుంటూ వుంటాడని వాళ్ళ స్థితినిబట్టిచూస్తే అంతకి మించి అనుకోవడానికేమీ ఆస్కారంలేదు. రాజు చిన్నప్పుడు బళ్ళోనూ, ఆటల్లోనూ తన జతగాడే. "పిలిస్తేనో! పిలవ్వచ్చు ఏం పిలిస్తే! తన నిప్పుడు కొత్తగా అనుకోబొయ్యేవారెవరూలేరు". ఇంతలో రాజు ఆ గుమ్మందగ్గరికి రానేవచ్చాడు. సరోజిని

రాజుని పిలిచింది. సంకోచిస్తూనే రాజు లోపలికి వచ్చాడు.

"ఇంకా చదువుతూనే వున్నావా రాజూ"

"ఊఁ"

"ఏం చదువుతున్నావ్?"

"ఈవూరి బళ్ళో ఆఖరిక్లాసు"

"అబ్బో చాలదూరం వచ్చేశావే"

"ఎంతైనా నీతో పరుగెత్తగలనా" వ్యంగ్యంగా అంటూ సరోజినివంక సూటిగా చూడలేక తలవంచుకున్నాడు రాజు.

"బళ్ళోకెళ్ళి సిగ్గుపడడంగూడా నేర్చుకుంటున్నావా రాజూ!"

"ముఖ్యంగా నీబోటివాళ్ళ ఎదట" అని నోటిదాకా వచ్చిన మాటని చిన్ననాటి స్నేహితురాలి మొహంజూసి అనలేకపోయాడు. అనకపోయినా ముఖాన్నిచూసి పోల్చేసుకుంది సరోజిని. సరోజిని యిప్పుడెప్పుడన్నా ఏడ్వాలని అనుకుంటే కళ్ళల్లో నీళ్ళకి బదులు పెదాలమీదికి నవ్వేవస్తుంది

"సరేగాని రాజూ! కస్త ఎప్పుడన్నా వచ్చిపోతుండరాదూ!"

"రావడానికి వీలుపడదు"

"ఏం?"

"పరీక్షలు దగ్గరపడ్డాయ్"

"పోనీ పరీక్షలు అయిపోయిన తర్వాతన్నా వస్తావుకదూ."

"అంత అవసరమేమొచ్చింది"

"నాకర్మ. వస్తావుగదూ"

"చూస్తాను" అంటూ వెళ్ళిపోయాడు.

ఆరోజు రాత్రి ఎనిమిదిగంటల ప్రాంతంలో వ్యవహారంమీద కాంతయ్య సరోజిని యింటికెళ్ళాడు. సరోజిని మేలుకొనేవుంది. పెట్రోమాక్సు లైటుకాంతిలో సరోజిని అద్భుతంగా కనిపించింది కాంతయ్యకి. వ్యవహారం విషయాలు మాట్లాడుతూనే ఆమెని పట్టుకున్నాడు. సరోజిని పెనుగులాడింది. కాంతయ్య ముఖం తన ముఖానికి రాసుకుంటుంది. అతడి పెదాలు తన బుగ్గల్నితాకి వెనక్కి పోయినై. సరోజిని బలాన్నంతా కూడదీసుకుని అతణ్ణి వెనక్కి తోసివేసింది. కాంతయ్య వెనక్కి పడిపోయాడు.

"మర్యాదగా బయటికి నడవండి లేకపోతే నేనే బయటకెళ్ళి నలుగుర్నీ పిలవ్వలసి వస్తుంది." అంది సరోజిని తడబడుతూ."

'సరోజినీ! బాగా ఆలోచించుకో లేకపోతే నీఆస్థంతా ఛిన్నాభిన్నమై పోతుంది' అని బెదరించాడు కాంతయ్య.

'చలమయ్య తాతా' అని కేకవేసింది. బయటఅరుగుమీద పడుకున్న తననౌకర్ని.

'అయితేసరే' అంటూ బయటకెళ్ళిపోయాడు కాంతయ్య.

'ఏమమ్మా' అంటూ వచ్చిన చలమయ్యతో 'కరణంగారు బయటకెళ్లినతర్వాత వీధివాకిలి గడివేసి పడుకో' అని మేడమీదికెళ్ళిపోయింది సరోజిని. మరునాడు చలమయ్యచేత రాజుకి కబురు పంపింది అవసరంగా వచ్చి కలుసుకోమని.

సాయంత్రం స్కూలు వదలంగానే రాజు సరోజని యింటికి వెళ్లాడు. మంచి నీళ్ళిచ్చి "కూర్చో" మంది సరోజని.

"అర్జంటుగా రమ్మన్నావట ఏమిటీ అఘాయిత్యం"

"అవసరం అర్జంటుగానే వచ్చింది. కూర్చో చెబుతా"

రాజు బల్లమీద కూర్చున్నాడు.

"కుర్చీ ఖాళీగానే వుంది"

"కుర్చీలో కూర్చునేవారు చాలమంది వున్నారుగాని సంగతేమిటో చెప్పు"

"నా సంగతి ఓపికగా వింటానికైనా తీరిక లేదా రాజూ!" ఆమె దీనత్వంచూసి రాజు చలించిపోయాడు.

'అబ్బే అదేం లేదుగాని తీరిగ్గానే చెప్పు' అంటూ స్థిమితంగా కూర్చున్నాడు రాజు.

"నీవు రాత్రిళ్ళు ఎక్కడ చదువుకుంటున్నావ్ రాజూ!"

'పెద్దినాయుడిగారి శంకరంతో వాళ్ళింటి దగ్గరే చదువుకుంటున్నా'

'మీ యిల్లు....'

'అది అమ్మెసెగా చదువుకోవడం'

'సరి సరి యిల్లూ అమ్మేశావ్. ఎక్కడుందామని.

'ఏట్లో'

'పోనీ మా యింట్లో చదువుకోడానికి నీ కేమన్నా అభ్యంతరమా'

'అసలు మీ యింట్లో చదువుకోవాల్సిన అవసరం?'

'నీకాక్కడులే అవసరం. నాకు. ఒంటరిగా వుండాలంటే చాల భయమేస్తుంది రాజూ".

'భయమేస్తుందా....! సరే భయమేస్తుందనే అనుకుందాం. మరి నా చదువు సంగతేమన్నా ఆలోచించావా? నేను వారాలు తిని చదువుకుంటున్నానని నీకు తెలియనే తెలీదా? ఏమిటి నీవుద్దేశ్యం సరోజినీ!'

సరోజిని గొంతు వికలమైపోయింది. 'రాజూ! నాకన్నీ తెలుసు. అందరూ తెలుసు. నీ చదువుకేమీ అభ్యంతరం రాదు. వూళ్ళో యింటింటికీ తిరగవలసిన అవసరం లేదు. ఇలాంటి ఆశలు పెట్టి నిన్ను లొంగదీసుకుంటున్నానని మాత్రం అనుకోవద్దు. ఈ వూళ్ళో పుట్టాను. ఈ మనుష్యుల మధ్యే పెరిగాను కాని యిప్పుడు వీళ్ళని చూస్తుంటే నాకు భయంవేస్తుంది రాజూ! నాకు అండగా నిలబడడం నీకు అంగీకారం కాకపోతే నేనెటో దూరంగా పారిపోక తప్పదు."

'ఏమిటి సరోజినీ! వింతగా మాట్లాడుతున్నావ్! నీగురించి నేను చాలవిన్నాను. అదంతా అబద్ధమేనంటావా!'

'మరి నిజమనమంటావా రాజూ! పెద్దవాళ్లు అనుకుంటే వాళ్ళు సలహాలు చెప్పడానికి యింటికివచ్చి సంబంధాలు కలుపుకోవాలని చూశారు. అయినా నిజానిజాలతో నీకేంపని. నేనెటువంటి దాన్నైనాకాని. ఆపదలో వున్నా. చిన్ననాటి నేస్తాన్ని.

'సరే నేనెప్పటికైనా యీవూరినుంచి వెళ్ళిపోవలసిన వాణ్ణె. నాకేమిటి నా చదు

(తరువాయి 22వ పేజీలో)

# నవ్వని బ్రతుకులు

(12వ పేజీ తరువాయి)

పుకి అవ్యంతరం లేనంతవరకు యిక్కడ వుంటాను."

అతని రెండుచేతులూ పట్టుకుని మిగిలిన కన్నీళ్ళన్నీ కార్చేసింది సరోజిని.

మరునాటినుంచీ రాజు జీవితం సరోజిని యింట్లోకి చేరింది. సరోజిని క్రింది భాగంలో హాలంతా సర్దించి రాజు చదువుకోవడానికి అందులో వుండడానికేర్పాట్లు చేయించింది. అతని నిత్యకృత్యాలన్నీ యిప్పుడు పనిమనిషే చూస్తున్నాడు. సరోజిని అతని చదువువిషయంలో తప్ప మరే విషయమునూ పట్టించుకోవడంలేదు. రోజులు నెమ్మదిగానే గడుస్తున్నై.

రాజుని వూళ్ళో చాలమంది కేకలు వేశారు. అయినా తను స్వతంత్రుడు. ఒకరిమీద ఆధారపడలేదు. చదువుకి అంతరాయం లేదు. తనమీ దుష్టశక్తికి దోహదంచేయడంలేదు. ఆవూరి విషయాలు అతనికి బాగా తెలుసు. అందుకనే ఆవూరితో సర్వసంబంధాలూ తెగదెంపులు చేసుకోవాలనే సన్నాహంలో వున్నాడు. తనకేమి యిప్పుడు యింటింటికీ వెళ్ళవలసిన అవసరంలేదు. తనకి ఏ నౌకరివ్వడు. అన్ని సౌకర్యాలూ బాగానే వున్నాయ్. వాళ్ళమాటల్ని ఎందుకు లెక్కచేయాలి! ఈ ధోరణిలో వూహించాడు రాజు.

పరీక్షలైపోయినై. కళకళలాడే మొహంతో వచ్చిన రాజునిచూసి సరోజిని చాల మురిసిపోయింది

"ఏం రాజూ! పరీక్షలన్నీ పూర్తయి వచ్చేనా? నావల్ల యిబ్బందేమీ జరగలేదు గదా!" అంది సరోజిని.

'మంచిదానివి సరోజినీ! ఏమో అనుకుని అనుమానపడ్డాను. కాని నిజాన్ని గ్రహించాను.

"నేను మంచిదాన్నని ఎంచి మనస్ఫూర్తితో అన్నవాడివి నీ వొక్కడివే రాజూ! ఎందుచేతనంటే నన్ను అన్యాయం చేయాలనే దృష్టిలేనివాడివి నువ్వొక్కడివే. తర్వాత నీ సంగతేమిటి రాజూ!"

'నా సంగతా! దానికేముంది. పరీక్షలు తెలిసిందాకా నీ దగ్గరే వుంటాను. తర్వాత ఏదో వుద్యోగం చూసుకుంటానికి యీ వూరు వదలివేయడం ఖాయం.'

"ఉద్యోగాలు సిద్ధంగా వున్నాయా రాజూ! వెళ్ళగానే దొరకడానికి"

'ఏమైనా అంతకంటే చేయగలిగిందేముంది.

'సరే పరీక్షలు తెలియనివ్వు ఆలోచిద్దాం" అని ముగించింది. ఆమె ముఖంలో ఏవేవో అవ్యక్త భావాలు తడబడుతున్నాయి. రాజు పరీక్షలు వ్రాసిన సంబరంలో హుషారుగా యీలవేసుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు.

కొంతకాలం మామూలుగానే గడిచిపోయింది. రాజు సరోజినిమీద ఏర్పరచుకున్న గురభిప్రాయాన్ని క్రమంగా మార్చుకోసాగాడు. కాని వూళ్ళోతనని ఎకసెక్కెంచేయడం కవ్వించడం అతనికి బాధ కలిగించింది.

ఒకనాటి సాయంకాలం ఊరికి దాపులో కాలువకట్టమీదికి షికారుకెళ్ళిన రాజుని నలుగురు మనుషులు మోసుకొచ్చి సరోజిని యింట్లో పడేశారు. ఒళ్ళంతా చిట్లి రక్తసిక్తమై స్పృహలేకుండావున్న రాజుని చూసి సరోజిని అంతా అర్థంచేసుకుంది. రాత్రికి రాత్రే బండివేసుకుని రాజుతో సహా రహస్యంగా బస్తీకి వచ్చి పడింది. రాజుని ఆస్పత్రిలో చేర్చి డాక్టరుతో తన విషయమంతా చెప్పబోసుకుంది. డాక్టరు సహాయంతో తన నగలన్నీ అమ్మి మిగతా డబ్బుతో కలిపి బ్యాంకులో వేయించి తన సర్వశక్తియు వినియోగించి చూసి డాక్టరు మద్రాసు తీసికెళ్ళమని సలహా యిచ్చాడు. మద్రాసులో రాజు మళ్ళీ మామూలు రాజు అయ్యాడు. హాస్పిటలో నుంచి విడుదలైన రోజున రాజును చూసి సరోజని తన అదృష్టాన్ని నమ్మింది.

మద్రాసులోనే ఇల్లు తీసికొని అందులో చేరారు యిద్దరూ."

ఒక రోజున రాజుకి అన్నం పెడుతూ "రాజూ! నీవు పరీక్ష ప్యాసయ్యావు తెలుసా! అంది. సరోజినిని చూస్తూ రాజు.

"పరీక్ష ప్యాసవడం పెద్ద అదృష్టమని నేననుకోవడంలేదు సరోజనీ. నీ చేతి భోజనం తినగల్గడం అదృష్టమని అనుకుంటున్నాను. కొన్నాళ్ళపాటు అలాంటి నీచుల యింట్లో భోజనంచేసి నందుకు నాకు బాగా శిక్ష పడింది అని గూడా అనుకుంటున్నాను."

"బహుశా ఆవూరికి మనకీ ఋణం తీరిపోయినట్లే. ఒక విధంగా యిక్కడ స్థిరపడిపోయినట్లే గూడా" అంది సరోజిని. అర్థంకాక సరోజని వంక పిచ్చిచూపు చూశాడు రాజు.

"అవును రాజూ! ఆవూళ్ళో నా ఆస్తి సంతా అమ్మించివేసి బ్యాంకులో వేశాను. నీ వెలాగూ పరీక్ష ప్యాసయ్యావు. నేనెక్కడాన్నీ అంత డబ్బుని ఏం చేసుకోను. పై చదువులు చదివి వృద్ధికోకిరా. నాకు మాత్రం యింతకంటే ఆనందం కలిగించేది మరొకటేమిటుంటుంది రాజూ!" అంటున్న సరోజనికేసి విస్మయంగా చూసి

"ఎంత అదిందావయ్యావు సరోజనీ! నీ డబ్బుపెట్టి నాకు చదువు చెప్పిస్తావా! అయినా ఎందాకా చెప్పిస్తావు చెప్పు చూద్దాం"

"నీ వెందాకా చదువుతావో చెప్పు చూద్దాం."

"డాక్టరు చెప్పించు చూదాం"

"సై" అంది సరోజని.

"సై" అనేశాడు రాజుగూడా ఆ వూపులో తీరా అన్న తర్వాతగాని అర్థంగాలేదు వ్యవహారం ఎంతదాకా వచ్చిందో. చల్లారిపోతున్న ఉత్సాహంతో ఎగిరాలేం గాని సరోజినీ! నేను మన వూరికొకసారి వెళ్ళిరావాలి.

"ఎందుకు?"

(తరువాయి 28వ పేజీలో)

## నవ్విన బ్రతుకులు

(22వ పేజీ తరువాయి)

'ఎందుకేమిటీ? స్కూల్లో నా రిజిష్టరు తీసికొని ఎక్కడైనా వుద్యోగ ప్రయత్నం చేసికోవద్దూ. పూటల్తో రోజులు గడుస్తాయా' అన్నాడు.

'సరే వెళ్ళి స్కూల్లో కాగితాలు తెచ్చుకో'

రాజు స్కూలికివెళ్ళి తిరిగి వచ్చేశాడు. 'స్కూళ్ళో సంగతులేమిట'ని అడిగింది సరోజని.

'సంగతులు కేముంది. మామూలుగానే జరిగిపోతుంది. కాకపోతే నాకు క్రొత్త బరువొకటి యిచ్చారు అంతే'

"విశదంగా చెప్పు రాజూ!"

"చెప్పడానికేముంది సరోజనీ. నన్ను స్కూళ్ళో ఎవ్వరూ "రాజు"అని పిలవలేదు. లేచిపోయిన సరోజని తాలూకు మనిషి అనే చెప్పుకున్నారు."

"సరే. కాగితాలు తెచ్చుకున్నావా"

"ఆఁ యిక ఉద్యోగం చూసుకోవడమే తరువాయి."

"అవసరం లేదు. బుద్ధిగా చదువుకో. కాలేజీలో చేరే విషయమేదో చూడు"

"'ఏమిటి సరోజిని! నిజంగానా" అని నివ్వెరపోయాడు రాజు.

"'అక్షరాల జరిగేది అంతే" అని తేల్చివేసింది సరోజని.

"'ఇహ ఎగతాళి వ్యవహారం కాదిది'" అనుకున్నాడు రాజు. దిశ్చక్రసీమల్లో తన ఆశలు ప్రస్ఫుటమైన వెలుగుతో పైకి పైపైకి ఎగబ్రాకుతున్నాయి. సంతోషాన్ని నిగ్రహించుకోలేక ఒక్కసారిగా సరోజనిని తన బాహువుల్లో యిరికించివేశాడు. సరోజిని ముఖంలో సహస్ర దళాలు పుట పుట మని విచ్చుకున్నాయ్. సంతోషంలో. ఉద్రేకంలో, వివశత్వంలో యింతగా చలిగిపోవడం సరోజినికి సరిక్రొత్త అనుభూతి. కాని కొన్ని క్షణాలలోనే ఆమె మామూలు స్థితికి వచ్చివేసింది.

"రాజూ!" అంది నెమ్మదిగా.

'సరోజనీ!' అన్నాడు రాజు మత్తుగా

వదులు' అని గద్దించింది.

సరోజనిని వదలివేసి తలవంచుకొని నిలబడ్డాడు.

"వెళ్ళి కాలేజీలో చేరే విషయం ఆలోచించు"

"అంతే రాజుని తన ఆశలకి అనుగుణంగా మైనపు ముద్దలాగా మలిచి ప్రాణ ప్రతిష్ట చేసింది.

అంతే రాజు - వారాలుతిని - పరాయి పంచల్లో చదువుకొనే రాజు 'ఇంతై అంతై వటు డంతై" అన్నట్లు మడమచెరగని యిస్త్రీ బట్టల్తో అన్ని పరీక్షల్ని ఒక్క వూపులో నెట్టుకొచ్చేశాడు.

ఈవేళరాజు డాక్టరు పరీక్షలో యూనివర్సిటీకంతా ఫస్టున వచ్చాడు. మళ్ళీ అదే వుద్రేకంతో సంతోషంతో సరోజనిని తన గుండెలమీద బిగించివేశాడు తానూ మునపటి అనుభూతినే రెండింతలుగా అనుభవించింది సరోజని.

'రాజూ!'

'సరోజనీ'

'ఏమిటీపిచ్చి. వదులు. చెప్పేదినీకా్కదూ!'

రాజు అమెని వదలివేశాడు.

'తప్పుచేశానా సరోజనీ?

'మరి తప్పుగాదూ!'

'ఎందుకని'

'డాక్టరుగారూ. మీరు బ్రహ్మచారులు. నేను వితంతువుని. పైగా లేచివచ్చినదాన్ని యిలా చేయవచ్చా. మీ గౌరవానికి భంగం కాదూ? యింక మీరు వుండలేరుగాని మంచి సంబంధం చూస్తానుండండి.'

'సరోజనీ తప్పుగాదూ?'

'ఏది?'

'నేను యింకొకర్ని పెళ్ళిచేసుకోవడం'

'ఎందుకని?'

'అబలవైయుండీ, లోకంలో 'నా' అన్నవ్యక్తి ఎవ్వరూ లేకుండా వున్న పరిస్థితుల్లో 'నా' అనుకోదగిన డబ్బునంతా వెచ్చించి ఒక మగవాణ్ణి గొప్పవాణ్ణిచేస్తే ఆమగవాడు ఆమె గుండెల్లో కుంపటిరాజేసి మరొక ఆడదానితో తన జీవితాన్ని సంధిస్తే అంతకంటే అపరాధం మరొకటుంటుందా చెప్పు'

'బాగుంది మీవరస. నాకేమీ ఫర్వాలేదు. నావద్ద యింకా చాల డబ్బుంది మిమ్మల్ని యింతవరకు తెచ్చాను. మిగిలిన పన్లుగూడా పూర్తికానివ్వండి!'

'మిగతా ఎన్ని పనులయినా చేయి. నాకేమీ అభ్యంతరంలేదు. కాని యిది నీకు తప్పు అనిపిస్తే నేనుగూడా నీలానే బ్రహ్మచారిగానే వుండిపోతాను గాని మరొక స్త్రీతో కలసి జీవిస్తానన్న మాటమాత్రం జరగదు' అని విసురుగా కాలేజీకి వెళ్ళిపోయాడు.

.... .. .... .... ....

మెరీనా బీచ్‌లో ఇసుకలో కూర్చుని ఎదురుగా వున్న లైట్ హౌస్ వంక చూస్తుంటే పైకధంతా సినిమా స్కోప్ చిత్రంలా కదిలిపోయింది. ఇంతలో రాజు చరచరా వచ్చి ఆమె ప్రక్కన చదికిలబడ్డాడు.

"సరోజినీదేవిగారూ!"

"సార్"

"ఇంటికి వెడదామా?"

క్షణంలో సరోజని ఒక నిర్ణయానికి వచ్చింది. చివాలునలేచి నీళ్ళలోకి దిగింది. కాళ్ళూ చేతులు కడుక్కుంది. ఆకాశంలోని రేరాజుకేసి చేతులు మోడ్చింది. మనసులో అనుకుంది.

"భగవంతుడా! రాజుకోసం నేను లోకాన్ని నేను ఎప్పుడో వదిలివేశాను. అది యిప్పుడు ఏమనుకున్నా నాకేమీ లక్ష్యంలేదు మనసులో అప్పుడప్పుడు ఆశలు రేగినా రాజు భవిష్యత్తుకోసం వాటిని అణచివేశాను. ఈనాడు నాకు మిగిలిన ఒక్క కోరికా రాజు కెలాంటి బాధా కలక్కూడదనే. ఎవరేమనుకున్నా రాజు నన్ను విశ్వసించాడు. నా పవిత్రత నాకూ నీకూ తెలుసు. ఈ అకలుషితమైన దాన్నే రాజుకి యిచ్చి అతణ్ణి ఆనందపరుస్తాను"

తిరిగి వద్దుకి వచ్చి రాజుకి చేయి అందించింది. ఆమె చేతి నందుకుని రాజు నిలబడ్డాడు. ఇరువురూ యింటికేసి సాగిపోయారు.